క్లుప్తంగా

రైతులకు మెరుగైన సేవలందిస్తాం



సిరికొండ: మండల కేంద్రంలోని సొసైటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలందిస్తామని చైర్మన్ గంగాధర్ తెలిపారు. సిరికొండ సొసైటీ మహాజన సభను గురువారం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ.. యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలుకు కేంద్రాలు త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీఈవో మహ్మద్ అలీ ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు. వైస్ చైర్మన్ నర్సయ్య, డైరెక్టర్లు సంతోష్‌రెడ్డి, చిన్నారెడ్డి, రమేష్, బాబన్న, లింగం, సిబ్బంది రాజారెడ్డి, నీలేష్, గిరిధర్, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కవిత్వంతో జీవన విధానంలో మార్పు తీసుకురావాలి



నిజామాబాద్ సిటీ: పాటతో అయినా, కవిత్వంతోనైనా ప్రజలను అలరించడమే కాకుండా వారి జీవన విధానంలో మార్పు తీసుకురావాలని విద్యాశాఖ సంయుక్త సంచాలకులు సరోజినీ దేవి అన్నారు. నగంరలోని కేర్ డిగ్రీ కళాశాలలో గురువారం హరిదా రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ అధ్యక్షతన 'మంచి కవిత్వం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సరోజినీదేవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చైతన్యంతో ప్రకాశించే మాటల మలయ మారుతం కవిత్వం అని అన్నారు. పలు కవితలను పాటలను వినిపించారు. ఈ సందర్భంగా పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం పుస్తక పరిచయాన్ని నిర్వహించారు. కవులు పంచరెడ్డి లక్ష్మణ్, నరాల సుధాకర్, కాసర్ల నరేష్ రావు, తిరుమల శ్రీనివాస్ ఆర్య, పద్మజా రెడ్డి, సుజాత, లక్ష్మి, వసంత లక్ష్మణ్, మద్దుకురి సాయిబాబు, గుత్ప ప్రసాద్, సిర్పలింగం, పద్మావతి, శంకర్ కవిత్వాన్ని వినిపించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ నవీన్, నాగనాథ్, సాయి, కిరణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ ఎమ్మెల్యే టికెట్ రవికే ఇవ్వాలి



నిజామాబాద్‌అర్బన్: కంటోన్మెంట్ ఎమ్మెల్యే టికెట్‌ను పిడమర్తి రవికే కాంగ్రెస్ పార్టీ ఇవ్వాలని మాదిగ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు తెడ్డు గంగారాం, మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బరికుంట శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఢిల్లీలోని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం ముందు గురువారం ఆయన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 12 శాతం మాదిగలున్నారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే టికెట్ పిడమర్తి రవి కేటాయించాలన్నారు. మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంతో పాటు ఎత్తొండలోని పోలింగ్ కేంద్రాలను బాన్సువాడ ఆర్డీవో రమేశ్ రాథోడ్ గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద నీటి సౌకర్యం, ర్యాంప్, విద్యుత్, టాయిలెట్స్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, తహసీల్దార్ సునీత తదితరులు ఉన్నారు.

ఎడపల్లిలో..

ఎడపల్లి: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను బోధన్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ గురువారం పరిశీలించారు. కేంద్రాలలో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్, సిబ్బంది ఉన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

బోధన్‌టౌన్: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం బోధన్‌లో 5కే రన్ నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి 5కే రన్‌ను ఆర్డీవో ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ప్రతిజ్ఞ చేశారు. ఏసీపీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, తహసీల్దార్ గంగాధర్, సీఐలు వీరయ్య, నరేశ్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేసి ప్రజాస్వామ్య పరిణతిని కాపాడాలని, ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తాలో ఓటు హక్కు అవగాహన కార్యక్రమంలో భాగంగా 5కే రన్ నిర్వహించారు. తహసీల్దార్ గజానన్ తదితరులు పాల్గొన్నారు.

మురుగుకు పరిష్కారమేది?

అభివృద్ధికి నోచుకోని వసంత్‌నగర్

- డ్రెయినేజీలు లేక ఖాళీ ప్రదేశాల్లో నిల్వ ఉంటున్న మురుగునీరు
- ఇబ్బందుల్లో కాలనీవాసులు



41వ డివిజన్‌లో డ్రెయినేజీలు లేకపోవడంతో ఖాళీ ప్రదేశాల్లో నిల్వ ఉన్న మురుగునీరు నీరు



పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారిన పార్కు స్థలం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని 41వ డివిజన్ పరిధిలోగల వసంత్‌నగర్, డాక్టర్స్ కాలనీల్లో డ్రెయినేజీలు లేక మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచి ఉంటుంది. దీంతో పరిసరాలు అధ్వానంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా కాలనీల్లో ప్రస్తుతం భవన నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. కానీ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు అంతా ఖాళీ స్థలాలు, రోడ్లపై నిల్వ ఉంటుంది. దీంతో పరిసరాలు మరింత అధ్వానంగా మారిపోతున్నాయి.

వర్షాకాలంలో మరీ అధ్వానం..

వసంత్‌నగర్, డాక్టర్స్ కాలనీల్లో ఏళ్ల తరబడిగా రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ లేదు. వర్షాలు పడితే రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో వరదనీరు చేరి చెరువులను తలపిస్తుంది. గతంలో ఎన్నోసార్లు ఈ ప్రాంతం అంత మునిగిపోయి ప్రజలకు ఇబ్బందులు ఏర్పడిన ఘటనలు కోకోల్లాలుగా ఉన్నాయి. అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుండటంతో డ్రెయినేజీల నిర్మాణం అత్యవసరంగా మారింది.

పార్కు స్థలం..

కాలనీలోని పార్కు స్థలాన్ని స్థానిక కార్పొరేటర్ నానా ఇక్కట్లు పడి గుర్తించి చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. అయినా పార్కును మాత్రం అభివృద్ధి చేయడం లేదు. కొంతమంది స్థానికులు అభివృద్ధికి అడ్డుపడడంతో ఆగిపోతుందని కార్పొరేటర్ పేర్కొంటున్నాడు. దీంతోపాటు మురుగునీరు సైతం వెళ్లకుండా అడ్డుకోవడంతో సమస్య మరింత జఠిలంగా మారుతుంది. కొంతమంది కాలనీలో రోడ్డు వేయకుండా దర్జాగా ప్రైవేట్ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. మురుగునీరు వెళ్లడానికి కచ్చకాలువ కూడా తీసినా మధ్యలోనే ఆపివేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి చేయిస్తాం..

ఈ ప్రాంతంలో మురుగునీరు ఎక్కడికీ వెళ్లకపోవడంతో ఖాళీ ప్రదేశాల్లో ఆగుతుంది. డ్రెయినేజీ నీరు వెళ్లడానికి కచ్చకాలువ తవ్విస్తే కొంతమంది అడ్డుకుంటున్నారు. ఇప్పటికే అధికారులు వచ్చి పరిశీలన చేశారు. భవిష్యత్‌లో ఇబ్బందులు రాకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకుంటాం. కాలనీ అభివృద్ధితోపాటు పార్కును సైతం అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటాం. స్థానికులు సహకరిస్తే మరింత అభివృద్ధి జరుగుతుంది.

– ఇందిరా వినోద్, 41వ డివిజన్ కార్పొరేటర్

నేటి చిత్రం..



అహ్మద్ బజారులో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రారంభమెప్పుడో?

నగరంలోని అహ్మద్ బజార్‌లో గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా భారీ వ్యయంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మించారు. కానీ ఈ భవనాన్ని ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా మారింది. అలాగే పేకాట ఆడేవారికి, మందుబాబులకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి, భవనాన్ని ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

రసాభాసగా మహాజన సభ



సభలో మాట్లాడుతున్న సొసైటీ ప్రతినిధులు

నిజామాబాద్ రూరల్: మండలంలోని పాల్దా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ జితెంధర్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన మహాజన సభ రసాభాసగా కొనసాగింది. సంఘంలో సుమారు రూ.13 లక్షల అవకతవకలకు పాలక మండలి సభ్యులు పాల్పడ్డారని పరపతి సంఘ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో సంఘ కార్యవర్గ సభ్యులకు, రైతులకు కొంత సేపు వాగ్వాదం నెలకొంది. 2021లో సంఘం ఈవో సునీల్‌రెడ్డి రూ.79లక్షల నిధులను దుర్వినియోగం చేయగా, అప్పటి డీసీవో సింహచలం రికవరీ చేశారు. అలాగే సునీల్‌రెడ్డి ఎల్‌టీ లోన్(లాంగ్ టమ్మ్ లోన్)ల రూపకంగా దాదాపు 18 మందికి రూ.13 లక్షల లోన్ మంజూరు చేశారు. రైతులు అప్పట్లోనే ఎల్‌టీ లోన్‌లు చెల్లిసై సహకార సంఘ రశీదులు ఇచ్చి నగదును మాత్రం సంఘంలో జమ చేయాలేదు. ప్రస్తుతం యాసంగి ధాన్యం వచ్చే నెల ఒకటో తారీఖు నుంచి కొనుగోలు చేయడానికి సభ్యులందరు తీర్మానం చేశారు. అదేవిధంగా రూ.13 లక్షలు కూడా రికవరీ చేయాలని సంఘ సభ్యులు, సహకార సిబ్బందిపై ఒత్తిడితెచ్చారు. ఈ విషయాన్ని డీసీవో వద్దకు తీసుకువెళ్తానని ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పీఏసీఎస్ చైర్మన్ జితెంధర్ తెలిపారు. సంఘ ప్రతినిధులు శ్రీనివాస్, గంగాధర్, మాదవరెడ్డి, మహేశ్వర్, సీఈవో రాకేష్ ప్రతాప్, రాంబాబు, రాములు రైతులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను ఆచరించాలి



మాట్లాడుతున్న గొర్రెపాటి మాధవరావు

నిజామాబాద్‌రూరల్(డిచ్‌పల్లి): దేశంలో సామ్రాజ్యవాదుల దోపిడీకి వ్యతిరేకంగా భగత్‌సింగ్ ఉద్యమించాడని, ఆయన ఆశయాలను ఆచరణలో ఉంచాలని న్యాయవాది, మానవ హక్కుల వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షులు గొర్రెపాటి మాధవరావు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా తెలంగాణ విశ్వవిద్యాలయంలో గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీ విద్యార్థులు భగత్‌సింగ్ ఆశయాలను ఆచరణలో ఉంచాలని పిలుపునిచ్చారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ సరిత మాట్లాడుతూ.. సమాజ హితం కోసం నేటి యువత ఆలోచించి పని చేయాలన్నారు. పీడీఎస్‌యూ ప్రతినిధులు జన్నారపు రాజేశ్వర్, జయంతి, మోహిత్, ప్రిన్స్, దేవిక, రవీందర్, అక్షయ్, ఆకాష్, బిందు, లహరి, నితిన్ పాల్గొన్నారు.

సజ్జ పంటల పరిశీలన

డొంకేశ్వర్: గ్రామాల్లో రైతులు వేసిన సజ్జ పంటకు కత్తెర పురుగు ఆశించడంతో మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న భవానీ గురువారం మండలంలో పర్యటించారు. మారంపల్లిలో పంటను పరిశీలించారు. కత్తెర పురుగు ఆకులను తినడం వలన తెల్లని పొర ఏర్పడుతుందని, తద్వారా రంధ్రాలు ఏర్పడుతున్నాయని రైతులు తెలిపారు. దీనికి వ్యవసాయాధికారిణి స్పందిస్తూ మొదటి, రెండో దశలోనే దీనిని గుర్తించాలని, లేదంటే పురుగు కంకిని తినేస్తుందన్నారు. పురుగును నివారించడానికి పిల్ల దశలో ఉన్న ఆకులను ఏరివేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

ఖలీల్‌వాడి: నందిపేట్ మండలం ఐలాపూర్ సొసైటీ చైర్మన్ మీసాల సుదర్శన్ గురువారం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌భవన్‌లో ఆయనకు ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ గురువారం కాంగ్రెస్ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. సొసైటీ చైర్మన్‌తోపాటు బీఆర్‌ఎస్ నేతలు నవీన్, గంగాధర్, మూడెడ్ల బాజన్న, కొండెలా భోజన్న, టప్పా రవి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, వినయ్ కుమార్‌రెడ్డి, మంద మహిపాల్, భోజరెడ్డి, ఇంద్రుడు, సాయినాథ్ గౌడ్, నాగరాజు, ఐలాపూర్ రాజు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

గణేశ్ ఆలయాల్లో 'చతుర్థి' పూజలు



నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలో అన్ని గణపతి ఆలయాలలో గురువారం సంకష్టహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద శ్రీ శుభం కరోతి కల్యాణం ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకము, గణపతి హోమం నిర్వహించారు. అనంతరం సాయంత్రం మహా హారతి, అన్నప్రసాద వితరణ చేశారు. రఘునాథ చెరువు వద్ద మహాగణపతికి సంకష్టహర చతుర్థి సందర్భంగా పంచామృత అభిషేకము, గరికపూజ, సిందూర సమర్పణ చేశారు. ఆలయ చైర్మన్ చిలముల భూషన్ చారి, అర్చకులు రాజుశర్మ, భక్తులు పాల్గొన్నారు.

కేతేశ్వర విగ్రహావిష్కరణ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని వినాయక నగర్ విగ్రహాల పార్క్ హనుమాన్ జంక్షన్‌లో గురువారం జిల్లా మేదరి సంఘం వారి ఆధ్వర్యంలో వారి కుల దైవం కేతేశ్వర స్వామి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ ధర్మపురి అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై, మాట్లాడారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు కృషి చేసిన మేదరి సంఘానికి శుభాకాంక్షలు తెలుపుతూ, చేతివృత్తుల వారికి బీజేపీ, తను ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. సంఘ అధ్యక్షుడు దేవేందర్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రారంభమైన వరికోతలు



నిజామాబాద్ రూరల్: రూరల్ నియోజకవర్గ పరిధిలో వరికోతలు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల్లో రైతులు దాదాపు లక్ష ఎకరాల్లో వరి సాగుచేశారు. ప్రస్తుత యాసంగిలో రైతులు సన్నరకం ధాన్యం అయిన గంగాకావేరి, జైశ్రీరాం, గంగాకావేరి-1, గంగా కావేరి -2 పంటలకు ప్రాముఖ్యతను ఇచ్చారు. అలాగే 50 ఎకరాల్లో మొక్కజొన్న, 20 ఎకరాల్లో శనగా, పది ఎకరాల్లో అపరాల పంటలు సాగు చేస్తున్నారు. వరికోతలు ప్రారంభమవడంతో రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని అధికారులు కోరుతున్నారు. ప్రభుత్వం ధాన్యానికి అందించే గిట్టుబాటు ధరను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

భీమ్‌గల్: నీటి ఎద్దడి నివారణకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. మండలంలోని తాళ్లపల్లి, రహత్‌నగర్ గ్రామాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ఎంపీడీవో, ఎంపీవోలతో కలిసి చర్చించారు.

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో మిషన్ భగీరథ వాటర్‌సరఫరాను గురువారం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తీసుకుంటున్న చర్యలను ఎంపీడీవో వనజను అడిగి తెలుసుకున్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	67,900	వెండి (కిలో)	78,500
22 క్యారెట్స్	62,622	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	30	50
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	40	60
జీరకాయ	35	60	దోసకాయ	15	30
దొండకాయ	20	40	ఆలుగడ్డ	16	30
బీర్నిసుకాయ	30	60	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిపువ్వు	30	50
వంకాయ	40	60	బీట్‌రూట్	20	40
పాలకూర	20	40	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 10.45, 1.40, 4.35, 7.30, 10.25
స్క్రీన్-2	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (తెలుగు) - 10.45, 1.50, 4.25, 10.25, ఓం భీమ్ బుష్ (తెలుగు) - 7.30
స్క్రీన్-3	ది గోట్ లైఫ్ (తెలుగు) - 1.15, 7.25, 10.40, కలియుగం పట్టణంలో (తెలుగు) - 4.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 10.10, 1.10, 7.50, 10.50, ది గోట్ లైఫ్ (తెలుగు) - 4.10
స్క్రీన్-2	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-తెలుగు) - 12.00, 2.40, గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-ఇంగ్లీష్) - 5.20, 8.00, 10.40
స్క్రీన్-3	ది గోట్ లైఫ్ (తెలుగు) - 12.05, 7.00, రజాకార్ (తెలుగు) - 3.45, ఓం భీమ్ బుష్ (తెలుగు) - 10.40
స్క్రీన్-4	శ్రీ (తెలుగు) - 10.45, 1.34, 7.40, 10.30, ప్రేమలు (తెలుగు) - 4.25
దేవి	టిల్లు స్క్వేర్ (తెలుగు)
నటరాజ్	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (తెలుగు)
లలితామహల్	ఓం భీమ్ బుష్ (తెలుగు)
విజయ్	రజాకార్ (తెలుగు)

సంక్షిప్తం

పాఠశాలకు కుర్చీల వితరణ



సిరికొండ: మండలంలోని గడ్కోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం (2009-10 పదో తరగతి బ్యాచ్) పూర్వ విద్యార్థులు కుర్చీలను వితరణ చేశారు. హెచ్ఎంలు శ్రీనాథ్, రవిందర్, వీడీసీ చైర్మన్ రాములు, పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు నరహరి, పూర్వ విద్యార్థులు ప్రశాంత్, రమేష్, నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



సిరికొండ: జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు చీమన్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి మాలావత్ నితిన్ ఎంపికైనట్లు పీఈటీ నవీన్ గురువారం తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ చాటి తెలంగాణ జట్టుకు ఎంపికయ్యాడని తెలిపారు. ఈ నెల 29 నుంచి మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో నితిన్ పాల్గొంటాడని తెలిపారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి గంగామోహన్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు జవహర్ తదితరులు విద్యార్థిని అభినందించారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి సత్కారం



సిరికొండ: సిరికొండ సత్యశోధక్ పాఠశాల పూర్వ విద్యార్థిని సుమలత ఇటీవల ఎంబీబీఎస్ ఉత్తీర్ణత సాధించింది. దీంతో గురువారం పాఠశాలలో ఆమెను ప్రిన్సిపాల్ నర్సయ్య జ్ఞాపిక అందజేసి సన్మానించారు. విద్యార్థిని తండ్రి విఠల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమతి లేని బడులపై చర్యలు తీసుకోండి

నిజామాబాద్‌అర్బన్: అనుమతి లేని ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గా ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వినాయక్‌నగర్, ఎల్లమ్మగుట్ట, చంద్రశేఖర్‌కాలనీలో అనుమతి లేకుండా ప్రయివేటు పాఠశాలలు కొనసాగుతున్నాయని, అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు దంతపరీక్షలు



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని జెండాగల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆర్బీఎస్కే ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది విద్యార్థులకు దంతవైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఐదుగురు విద్యార్థులకు దంత సమస్యలను ఇద్దరు విద్యార్థినులకు రక్తహీనత ఒక విద్యార్థికి పసిరికలు ఉన్నట్టు గుర్తించారు. వీరిని మంగళవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య చికిత్సలు చేయిస్తామని డాక్టర్ సభ తెలిపారు. హెచ్ఎం రామచందర్ గైక్వాడ్ ఉపాధ్యాయులు మంజుల, నరేష్, కవిత పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు



నిజామామాద్ రూరల్: మండలంలోని గుండారం గ్రామ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. గురువారం పరీక్షల కో-ఆర్డినేటర్ రామ్మోహన్ మాట్లాడుతూ.. గ్రామంలోని పరీక్షకేంద్రంలో 233 మంది విద్యార్థులు ఉండగా 231 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

బుక్స్, పేపర్స్, స్టేషనరీ అసోసియేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన



ఖలీల్‌వాడి: నగరంలోని మాధవనగర్‌లో గురువారం నిజామాబాద్ బుక్స్, పేపర్స్, స్టేషనరీ అసోసియేషన్ నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బాడ్సి శేఖర్‌గౌడ్, భక్తవత్సలం(ఢిల్లీ) తదితరులు ఉన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



ఖలీల్‌వాడి: నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం నిర్వహించారు. అసోసియేషన్‌లో 336 మంది సభ్యులు ఉండగా, 300 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల్లో అసోసియేషన్ అధ్యక్షుడిగా జగన్ మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పి. రాజు ఎన్నికయ్యారు. అలాగే జనరల్ సెక్రటరీగా వసంతర్‌రావు, జాయింట్ సెక్రటరీగా సురేష్, లైబ్రరీ సెక్రెటరీగా పిల్లి శ్రీకాంత్, స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శిగా అయూబ్ ఎన్నికైయ్యారు. నూతన కార్యవర్గాన్ని న్యాయవాదులు సన్మానించారు.